# సున్నం కొట్టిన సమాధులు

**16, గురువారం—సెప్టెంబర్-1990**

మొదటిసారిగా మెడికల్ కాలేజీలో అడుగుపెడితే...ఎంతో గొప్పగా ఫీలయ్యాను. మరో అయిదేళ్ళలో డాక్టర్నవుతున్న ఊహ .... అమ్మ నాన్నల ఆశలు ఫలింపజేసానన్న ఘనత నన్ను ఉక్కిరి బిక్కిరి చేస్తున్నది.

ఎమ్సెట్ ఎంట్రన్స్‌లో స్టేట్ థర్డ్ రాంకు సంపాదించి ఈ రోజే మెడికల్ కాలేజీలో జాయినవుతున్నాను.

కాలేజి మెయిన్ గేటుపైన 'క్రొత్త విద్యార్థులకు స్వాగతం' అన్న బ్యానర్ ఎంతో అందంగా వుంది.

**21, మంగళవారం – సెప్టెంబర్**

ఎటు చూసినా కాలేజి అంతా తెల్లపావురాల్లా అమ్మాయిలు, అబ్బాయిలు. విష్ చేసిన ప్రతీసారి....ఏవో ప్రశ్నలేసి చంపుతున్నారు. ఇప్పటి వరకు అన్ని ప్రశ్నలకు జవాబులిచ్చాను. చెత్త ప్రశ్నలు!

అబ్బాయిలేకాదు...అమ్మాయిలూ కొంచెం వేధిస్తున్నారు. రోజు రోజుకీ క్రొత్త విద్యార్థులు ఎక్కువవటంతో సీనియర్ విద్యార్థుల ఆగడాలు చాలా అవుతున్నాయి...

## 28, సోమవారం - సెప్టెంబర్

సీనియర్ విద్యార్థుల గురించి ఒక లెక్చరర్‌కి చెప్పినా లాభం లేక పోయింది. అది మామూలే అన్నాడు.

ఏడ్పించటం ఇంత నీచంగా వుంటుందా? ఈ రోజు కొందరమ్మాయిలు ఒక స్టూడెంట్‌ని కట్ డ్రాయరు మీద కాలేజి చుట్టూ పరిగెత్తించారు.

అతడేడుస్తూ పరిగెత్తటం చూసి నాకు భయమేసింది. వాళ్ళ బారిన పడకుండా వుండాలంటె ఏం చేయాలో పాలుపోవటం లేదు. కాలేజీకి అటెండవకపోతే బావుండదు.

## 3, శనివారం - అక్టోబర్

ఈ రోజు ఉదయం కాలేజీ మెట్లెక్కుతున్న నన్ను కాలు అడ్డం పెట్టి పడగొట్టారు వెధవలు. ఏరా.... అమ్మాయిల్నిచూసి నడవటమేనా.... మగాళ్ళ దిక్కు అసలు చూడటమే లేదా? నేను నీళ్లు మింగితే.... ఒక చీటీని చేతిలో వుంచి.... ఓ చెట్టుక్రింద చదువుకుంటున్న ఒకమ్మాయికి ఇవ్వమన్నారు. ఇవ్వనంటే డ్రాయరు మీద పరిగెత్తిస్తామన్నారు. భయం భయంగా తీసికెళ్ళి ఆమె కిచ్చిన అరక్షణానికే నా చెంప పగిలిపోయింది. నా కళ్ళల్లో నీళ్ళు తిరిగితే వెనక్కి పరుగెత్తుకొచ్చాను. అందులో 'ఎనాటమీ ప్రొఫెసరు గాడి దగ్గర అయిదు రోజులు పడుకుంటేనే కదూ నువ్వు ఆ సబ్జక్టులో పాసయింది' అని వుందట.

ఈ అవమానం భరించలేకుండా వుంది. నన్నామె చెంప పగులగొట్టినపుడు చాలామంది స్టూడెంట్స్ చూసారు.

మెడికల్ కాలేజి అంటె ఇంత దారుణంగా వుంటుందా? ఇంటికి పారిపోవాలనిపిస్తోంది కాని అమ్మ, నాన్న నామీద ఎన్ని ఆశలు పెట్టుకున్నారు???

నేను పారిపోతే పిరికిపంద అంటారేమో?

**12, సోమవారం - అక్టోబర్**

ఈ రోజు నాకు హాస్టల్ గది కేటాయించారు. రూమ్ నెంబరు 32. గదిలో జాయినయిన రోజు ఉదయం అందులో వున్న ఇద్దరు సీనియర్ విద్యార్థులు చాలా సేపు వేధించారు, బాధించారు

ఇలా రోజూ చేస్తారేమో...??

గదిలోకెళ్ళగానే నా బ్యాగులు సోదాచేసి అమ్మ చేసిన సున్నుండలు వాళ్ళే తిన్నారు. 'సున్నుండ' అన్న నిక్‌నేమ్ పెట్టి కాలేజీలో ప్రచారం చేసారు.

మహారాష్ట్రలో ఒక మెడికల్ కాలేజీలో రాగింగ్ భరించలేని సెన్సిటివ్ స్టూడెంట్ ఆత్మహత్య చేసుకున్నట్టు.... పేపర్‌లో చదివాను.

ఒక్కోసారి వీళ్ళ చేష్టలు థర్డు డిగ్రీ స్థాయిలో వుంటున్నాయి.

**15, గురువారం - అక్టోబర్**

ఈ రోజు క్లాస్ రూంలో వున్నప్పుడు అనాటమీ ప్రొఫెసరు నించి పిలుపొచ్చింది. నన్నెవరు పిలుస్తారనుకొని భయంగా స్టాఫ్ రూంలోకి అడుగుపెట్టగానే....ఒక పెద్దమనిషి మొహం వాచేలా నన్ను చివాట్లు పెట్టాడు

ఈడియట్.... మొన్న కాలేజి లాబీలో సువర్చలకు నాకు అక్రమ సంబంధం వున్నట్టు చీటి రాసిచ్చావట.... నువ్వు డిగ్రీ తీసుకోవడానికి పన్నెండేళ్లు పడుతుంది. 'గెటవుట్' అన్నాడు కోపంగా వూగిపోతూ చివరగా.

రూంకొచ్చి చాలా సేపు ఏడ్చాను. నాన్నకు లెటరు రాయాలన్పించ లేదు. నిన్న సాయంత్రం నాన్న పంపిన వందరూపాయలు మనియార్డరు అందిన వెంటనే ఇద్దరు రూమ్మేట్లు చెరో యాభై లాక్కున్నారు.... ఏమి అనలేకపోయాను. ఏమైనా అంటే మళ్ళీ ఏం చేస్తారో....?

**23, శుక్రవారం - అక్టోబర్**

మొదటిసారి ఆప్రాన్ భుజాన వేసుకున్నప్పుడు ఎంత గొప్పగా

ఫీలయ్యాను? తెల్లగా.... మెత్తగా వున్న ఆ కోటుకు సమాజంలో ఎంత విలువుందో....అది మలినం కాకుండా ఎంత బాగా కాపాడుకోవాలో వూహించుకున్నాను. అది వేసుకుంటే దేవుడిలా కన్పించాలి కాని.... 'సున్నం కొట్టిన సమాధిలా' కాదనిపించింది.

నాన్నకు ఈరోజే లెటరు రాసాను. ఆప్రాన్ కుట్టించుకున్నానని.... అది వేసుకొని ఫొటోదిగి పంపమని అమ్మ లెటరు రాయించి పంపింది.

దిగి పంపుదామని వున్నా డబ్బుల్లేవు. వీళ్ళిద్దరు వందరూపాయలు వాపసు ఇచ్చేలా లేరు. అడిగితే కసురుకుంటారేమో...?

## 30, శుక్రవారం - అక్టోబర్

ఈ రోజు క్లాసురూంలోకి అడుగుపెడుతూనే.... పుస్తకాల మధ్య మడిచివున్న ఆప్రాన్ తీసి భుజాన వేసుకుంటూ స్టన్నయ్యాను....అపాటికే క్లాసు మొత్తం నవ్వుతోంది. ప్రొఫెసరు కాస్త చిరాగ్గా మొహం పెట్టారు. కారణం నా ఆప్రాన్ పూర్తి ఎర్రరంగులో వుంది. రూమ్మేట్లలో ఎవడో ఎర్ర రంగులో ముంచి వుంటాడు.

'ఏ జిల్లా బాబు?' ప్రొఫెసరు గారడిగితే 'కరీంనగర్ సార'న్నాను అంతా నవ్వారు! ఇది నక్సలైట్ సంస్థ కాదు బాబు, మెడికల్ కాలేజీ! అన్నాడా ప్రొఫెసరు. చాలా అవమానంతో కుంగిపోయాను.

నా సీట్లో కూచుంటుంటె వెనకనించి ఎవరో అన్నారు.

'హలో నక్సలైట్...'

ప్రొఫెసర్లంతా ఇకనుంచీ ఆ పేరుతోనే పిలుస్తారేమో....భయం, బాధ నన్ను చదవనివ్వటం లేదు. మానవత్వం మరచి ప్రవర్తిస్తున్నారు అంతా.

## 9, సోమవారం - నవంబర్

24 గంటలూ తెరచివుండే లైబ్రరీ ఈ మెడికల్ కాలేజీలోనేవుంది. చాలామంది స్టూడెంట్స్ రాత్రి భోజనమయ్యాక కూడా లైబ్రరీకెళ్ళి చదువు కుంటారు.

ఈ రోజు లైబ్రరీ కెళ్ళాను. అంతంత పెద్ద బుక్స్ చూసి భయపడ్డాను. ఇంగ్లీషులో చదవటం కష్టంగా వుంది. ఈ రోజు పెద్దక్కయ్య నించి కూడా ఉత్తరమొచ్చింది. కాని ఆ పాటికే ఎవరో దాన్ని చించి చదివినట్టున్నారు.

## 16, మంగళవారం - నవంబర్

ఈ రోజు మెట్లు దిగుతున్నప్పుడు ముగ్గురమ్మాయిలు కాలు అడ్డుపెట్టి పడగొట్టారు. మొదటిసారి సహనం కోల్పోయి బూతు మాట తిట్టాను.

ఒకామె విసురుగా వచ్చి చెంప పగులకొట్టింది.

ఆమె సువర్చల...ఆ రోజు చీటీ అందించిన రోజు కొట్టిన సువర్చల...మళ్ళీ రెండో దెబ్బ.

నాకెందుకో పట్టరాని కోపంతో కాలేజీని ఒక్కసారి పేల్చేయాలనిపించింది. నేను నిస్సహాయంగా వెనుదిరిగి వస్తుంటె.

'గుడ్‌బై....సున్నుండా మళ్ళీ ఎప్పుడు కలుస్తావ్' అన్నారు అంతా! బాధగా గదికెళ్ళి పడుకొని పదిగంటలకి మెస్ కెళ్ళేసరికి అన్నం అయిపోయింది.

కాలే కడుపుతో పడుకుంటె అమ్మ గుర్తొచ్చి మౌనంగా ఏడ్చాను. ఈ రాగింగ్ ఇంకా ఎన్నాళ్ళుంటుందో....నాన్నకు డబ్బు పంపమని ఎలా రాయను? ఈ ఇంటరు చదవడానికే ఎన్ని కష్టాలు పడాల్సి వచ్చింది.

## 22, సోమవారం - నవంబర్

పెద్దక్కయ్య నించి తిట్టుకుంటూ లెటరు వచ్చింది. నేను చదవక సినిమాలు-షికార్లు కొడుతున్నానని నా ఫ్రెండ్స్ లెటరు రాసారని....

మొదటిసారి రూమ్మేట్ల మీద తిరగబడ్డాను. ఇంకోసారి లెటర్లు చింపి మా వాళ్ళకు దొంగ ఉత్తరాలు రాస్తే....నేనేమిటో చూపిస్తానన్నాను. నా కోపం చూసి వాళ్లు కొంచెం వెనక్కి తగ్గారు. పెద్దక్కయ్యకు అన్ని వివరాల్తో లెటరు రాయాలి.

సువర్చల ఈ రోజు 'హాయ్ క్రామేడ్....' అంది ఎగతాళిగా. ఈ మధ్య సెలవులు రాకముందే సువర్చలకు తగిన గుణపాఠం చెప్తాను.

**26, శుక్రవారం - 'ముగింపు దృశ్యం'**

రాత్రి పదవుతోంది.

లైబ్రరీ నించి తిరిగి వస్తున్న సువర్చలకు రామ్మూర్తి ఎనాటమీ లాబ్ ముందు ఎదురయ్యాడు. అసహ్యంగా చూసింది. రామ్మూర్తి విష్ చేస్తే ఆగిపోయింది.

'ఏం కావాలి?'.... సీరియస్‌గా అడిగింది.

'మీతో కొంచెం మాట్లాడాలి' ముందుకు కదిలాడు. ఆ వరండా ఒక బల్బు వెలగక కొంత చీకటిగా వుంది.

ఆమె కొద్ది భయంగా వెనక్కి జరిగింది. క్షణంలో రామ్మూర్తి అనాటమీ లాబ్ తలుపు తెరిచి సువర్చలను గదిలోకి త్రోసి... బయటికి తాళం వేసి గబగబా చీకట్లో కల్సిపోయాడు.

అనాటమీ లాబ్‌లో అన్నీ శవాలు...భయంగా సువర్చల అరచిన అరపులు ఎవరికీ విన్పించలేదు.

కొద్ది గంటల్లో భయంతో శవాల మధ్య శవంగామారింది సువర్చల.

ఉదయం కాలేజీలో గుప్పుమంది. సంచలనంగా వార్త పాకింది. తెల్లారినించి రాగింగ్ అసలు జరగలేదు.

ఈ విషయం రామ్మూర్తి తన 'డైరీ'లో రాసుకోలేదు. ★